# సాక్షి
## తూర్పుగోదావరి

సోమవారం | 15 | జనవరి | 2024






### రూ.1,00,116 విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు జొన్నలగడ్డ సోమశేఖర్, నాగమణి దంపతులు (రాజమహేంద్రవరం) ఆదివారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



### పందెం కోడీ

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి కోడి పందేలు ఆదివారం మొదలయ్యాయి. వీటిని పలువురు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

II లో

### డెల్టాలకు 8,300 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు ఆదివారం 8,300 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,300, మధ్య డెల్టాకు 2,000, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.20 అడుగులకు చేరింది.

## న్యూస్‌రీల్

### టీడీపీ - సేనకు బై.. వైఎస్సార్ సీపీకి జై



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: తూర్పు గోనగూడెంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పార్టీ కండువాలు వేసి, స్వాగతం పలికారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు చల్లా వెంకట్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామ గ్రామానా ఇతర పార్టీల నుంచి అనేక మంది వైఎస్సార్ సీపీలోకి వస్తున్నారని అన్నారు. ఎన్నికల తేదీ నాటికి నియోజకవర్గంలో ఈ చేరికలు మరింత ఎక్కువగా ఉంటాయని, ఆ రెండు పార్టీలూ దాదాపు ఖాళీ అయినా ఆశ్చర్యపడనవసరం లేదని చెప్పారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.1,158 కోట్లతో అభివృద్ధి, రూ.1,142 కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేయడమే ఇందుకు ప్రధాన కారణమని అన్నారు. రాష్ట్రంలో కుల మత వర్గ రాజకీయాలతో సంబంధం లేకుండా, అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమాన్ని అందిస్తోందని చెప్పారు.

### అయినవిల్లిలో భక్తుల సందడి

అయినవిల్లి: భోగి పర్వదినం, ఆదివారం కలసి రావడంతో అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. స్వామి సన్నిధిలో సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి మేలుకొలుపు సేవ నిర్వహించి, విశేష పూజలు చేశారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్వామివారి లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీ గణపతి హోమంలో భక్త దంపతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారికి గరిక పూజ జరిపారు. పంచామృత, ప్రత్యేక అభిషేకాల్లో 44 మంది భక్త దంపతులు పాల్గొన్నారు. వెయ్యి మంది స్వామివారి ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. లక్ష్మీ గణపతి హోమంలో 23 మంది పూజలు చేసుకున్నారు. 49 మంది నూతన వాహనాలకు పూజలు చేయించుకున్నారు. 12 మంది చిన్నారులకు నామకరణాలు, అక్షరాభ్యాలు చేశారు. స్వామివారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాల ద్వారా రూ.2,69,500 ఆదాయం వచ్చినట్టు ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు, చైర్మన్ గుత్తుల నాగబాబు తెలిపారు.

### పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో భోగి పండగ సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఉప ఆలయాల్లోని స్వామి, అమ్మవార్లకు కూడా పూజలు చేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యాన ఆలయ ప్రాంగణంలో తెల్లవారుజామున భోగి మంట వేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

# పచ్చని సీమలో ప్రభంజనం



- విశ్వవ్యాపితం ఏకాదశ రుద్ర ప్రభల కీర్తి
- ఆ ప్రభల సంగమం అరుదైన ఘట్టం
- నాలుగున్నర శతాబ్దాల ఘైబడిన చరిత్ర
- రేపు జగ్గన్నతోట ప్రభల తీర్థం

అంబాజీపేట: పచ్చని సీమ కోనసీమ.. రవికిరణాలు పడితే పచ్చదనం వసివాడుతుందేమో అన్నట్టుగా ఆ సీమకు ఆచ్ఛాదనగా నిలువెత్తు కొబ్బరి చెట్లు, వరి చేలు.. ఆ చెట్ల మధ్యలో చీమల బారుల్లా చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా భక్త జనసందోహం మధ్య రుద్రప్రభలు.. చూసేందుకు రెండు కళ్లూ చాలవు. ఇదంతా సంక్రాంతి వేడుకలో భాగంగా కోనసీమ వాసులు చేసుకున్న కోటి జన్మల పుణ్య ఫలం. ఆ కోలాహలం చెవులారా వినాల్సిందే. ఆ వైభవాన్ని కళ్లారా చూడాల్సిందే. కోనసీమ జిల్లా వ్యాప్తంగానే సంక్రాంతి, కనుమ పండగల సందర్భంగా ప్రభల తీర్థాలు కన్నుల పండువగా జరుగుతాయి. ముఖ్యంగా అంబాజీపేట మండలం మొసలపల్లి శివారు జగ్గన్నతోటకు తరలి వచ్చే ఏకాదశ రుద్రులు.. దేశ విదేశాల నుంచి వేలాదిగా తరలివచ్చే భక్తులు.. ఏకకాలంలో ఏకాదశ రుద్రులను దర్శించుకుని భక్తి పారవశ్యంలో మునిగి తేలే భక్త ప్రభంజనం మంగళవారం ఆవిష్కృతమయ్యే ప్రభల సంబరం. గత ఏడాది గణతంత్ర వేడుకల్లో కోనసీమ రుద్రప్రభల నమూనా ప్రదర్శించడంతో ఏకాదశ రుద్రులకు విశ్వవ్యాప్త కీర్తి లభించింది. గంగలకుర్రు అగ్రహారానికి చెందిన శివకేశవ యూత్ కృషి ఇందులో ఎంతో ఉంది. 2020లో వారి ఆధ్వర్యాన ఏకాదశ రుద్రుల విశిష్టతపై ప్రధాని మోదీకి లేఖ రాయడం.. 2021లో శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీ తీర్థ స్వామి సైతం ఏకాదశ రుద్రుల ప్రాశస్త్యంపై మంగళాశాసనాలతో సందేశం పంపడం ఎంతో గర్వకారణం. ఇక్కడ 450 ఏళ్లుగా ప్రభల ఉత్సవం జరుగుతున్నప్పటికీ.. గత ఏడాది వచ్చిన జాతీయ స్థాయి గుర్తింపుతో ఈ ఏడాది భారీగా భక్తులు వస్తారని భావిస్తున్నారు. ప్రకృతి ఒడిలో ఏవిధమైన గుడి, గోపురం లేకుండా ఏడెకరాల విస్తీర్ణంలో జరిగే ఏకాదశ రుద్రుల సంగమం బహుశా ప్రపంచంలోనే అరుదు. ఈ ప్రభలు వచ్చేందుకు రోడ్డు మార్గం ఉన్నప్పటికీ గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం ప్రభలు సంప్రదాయం ప్రకారం వరి చేలు తొక్కుకుంటూ అప్పర్ కౌశికను దాటుకుని తీర్థంలోకి వచ్చే దృశ్యం చూసి తీరాల్సిందే.

**ఇంద్రధనస్సును తలపించేలా..**

తాటి శూలం, టేకుచెక్క, పోక చెట్ల పెంటిలను, శివునికి ప్రీతిపాత్రమైన మర్రి ఊడలు, వెదురు బొంగులతో ప్రభను తయారు చేస్తారు. దిగువన టేకు చెక్క ఉంచి, మధ్యలో తాటి శూలం ఉంచుతారు. శూలానికి వెదురు చెక్కలను ఉంచి వెదురు గెడలతో అర్ధచంద్రాకృతిలో ప్రభను తయారు చేస్తారు. దీనికి మొగ్గ వేయడం మరింత ప్రత్యేకం. తెల్లని వస్త్రంతో పుష్పాకారంలో అమర్చే ఈ మొగ్గ చూపరులను ఆకట్టుకుంటుంది.

వెదురు గెడల మధ్య రంగురంగుల నూలుదారాలు (కంకర్లు), రంగురంగుల కొత్త వస్త్రాలతో అందంగా తీర్చిదిద్దుతారు. కంకర్లతో ప్రత్యేకంగా తయారు చేసే అల్లికలో నిపుణులైనవారు ఈ తయారీలో పాల్గొంటారు. ప్రభపై పసిడి కుండ ఉంచి, చుట్టూ నెమలి పింఛాలతో అలంకరించి, కింది భాగాన జేగంటలు వేలాడదీస్తారు. రైతులు తమ పొలాల్లో పండే వరి కంకులతో తయారు చేసిన కుచ్చులను వీటికి అమర్చుతారు. గుమ్మడి కాయలు, ఇతర కూరగాయలు, పెద్దపెద్ద పూల దండలతో ప్రభకు మరింత ముస్తాబు చేస్తారు.

### వీరే ఏకాదశ రుద్రులు

వ్యాఘ్రేశ్వరం వ్యాఘ్రేశ్వరస్వామి, కె.పెదపూడి మేనకేశ్వరస్వామి, గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి, గంగలకుర్రు చెన్న మల్లేశ్వర స్వామి, వక్కలంక కాశీ విశ్వేశ్వరస్వామి, నేదునూరు చెన్న మల్లేశ్వరస్వామి, ముక్కామల రాఘవేశ్వరస్వామి, మొసలపల్లి మధుమానంత భోగేశ్వరస్వామి, పాలగుమ్మి చెన్నమల్లేశ్వరస్వామి, పుల్లేటికుర్రు అభినవ వ్యాఘ్రేశ్వరస్వామి పేర్లతో ప్రభలు మొసలపల్లి సమీపంలోని జగ్గన్నతోటకు వస్తాయి. వ్యాఘ్రేశ్వరం నుంచి వచ్చే వ్యాఘ్రేశ్వర స్వామి ఈ తీర్థానికి అధ్యక్షత వహిస్తారు. తొండవరంలో జరిగే ప్రభల తీర్థంలో కొలువుతీరే వాకలగరువు, తొండవరం ప్రభలను జిల్లాలో అన్ని ప్రభల కంటే ఎత్తులో నిర్మించడం ప్రత్యేకం. సుమారు 52 అడుగుల ఎత్తున ఉండే ఈ ప్రభలు ఒకదానితో ఒకటి పోటీ పడుతూంటాయి.

# ఈ రాతిరే.. ప్రభోదయం

కొత్తపేట: జిల్లావ్యాప్తంగా కనుమ నాడు ప్రభల ఉత్సవాలు ఆరంభం కానుండగా.. కొత్తపేట ప్రభల ఉత్సవాలు మాత్రం మకర సంక్రాంతి రోజునే నిర్వహించడం ఆనవాయితీ. సుమారు 500 సంవత్సరాల నుంచి ఇక్కడ ప్రభల ఉత్సవాలు నిర్వహిస్తున్నారని పెద్దలు చెబుతుంటారు. పాత రామాలయం, కొత్త రామాలయం వీధుల పేరుతో ఇక్కడ ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. పాత రామాలయం వీధి పరిధిలోని బోడిపాలెం వీధి వారు కొన్నేళ్లుగా మూడో వీధిగా అరంగేట్రం చేసి, సాయంత్రం పై రెండు వీధులతో పాటు బాణసంచా కాలుస్తున్నారు. కొత్తపేట ప్రభల సంబరాలకు ఉత్సవ కమిటీలు భారీ ఏర్పాట్లు చేశాయి.

**ఉత్సవం జరుగుతుందిలా..**

ఆయా వీధులకు చెందిన ప్రధాన ప్రభలపై వీరభద్రస్వామి, రాజరాజేశ్వరీదేవిని, మిగిలిన 10 ప్రభలపై వివిధ దేవతామూర్తులను అలంకరిస్తారు. ఈ ప్రభలతో ఉదయం నుంచీ ఆయా వీధుల్లో కోలాహలంగా భారీ ఊరేగింపు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో తొలుత పాత రామాలయం, తరువాత కొత్త రామాలయం వీధుల ప్రభలు.. గ్రామ పెద్దలు, ఆబాలగోపాలం వెంట రాగా.. మంగళ వాయిద్యాలు, బ్యాండు మేళాలు, బాణసంచా కాల్పుల నడుమ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ఆవరణలకు చేరుకుంటాయి. అక్కడ ప్రభలను భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరిస్తారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకూ వరుసగా బోడిపాలెం, పాత రామాలయం, కొత్త రామాలయం వీధుల వారు రకరకాల బాణసంచా కాల్పులు జరుపుతారు. అక్కడితో పగటి పూట ఉత్సవం ముగుస్తుంది. రాత్రి 10 గంటలకు ప్రభల తిరుగు ప్రయాణంతో రాత్రి ఉత్సవం ప్రారంభమవుతుంది. ఈ ఊరేగింపు అర్ధరాత్రి 2 గంటల సమయానికి పాత బస్టాండ్ సెంటర్‌కు చేరుకోగానే ఉత్సవంలో ప్రధాన ఘట్టమైన బాణసంచా కాల్పులు ప్రారంభిస్తారు. అక్కడ పాత, కొత్త రామాలయాల వీధుల వారు ఒక్కొక్కరూ నయనానందకరంగా సాగే సుమారు 25 రకాల బాణసంచాలను కాలుస్తారు. అవి దేదీప్యమానంగా వెదజల్లే కాంతుల్లో ఆ ప్రాంతమంతా కొత్త శోభను సంతరించుకుంటుంది. ఉదయం 5 గంటలకు కాల్పులు పూర్తి కాగా, ఏ వీధి ప్రభలు ఆ వీధికి చేరుకోవడంతో ఉత్సవాలు ముగుస్తాయి.



ప్రభను తయారు చేస్తున్న భక్తులు

### అలా మొదలైంది



పూర్వం కొన్ని కుటుంబాల్లో వీరభద్రుడిని పూజించి, ఉత్సవాలు జరిపేవారు. క్రమంగా అది కాస్తా గ్రామ ఉత్సవంగా మారింది. మునసబుగారి ఇంట వీరభద్రునితో ప్రధాన (పాత రామాలయం) ప్రభతో సంక్రాంతి ప్రభల ఉత్సవంగా రూపాంతరం చెందింది. తరువాత భక్త రామదాసు మేనమామలైన అక్కన్న, మాదన్నలు హరిహర దేవాలయాలు నిర్మించగా.. ఆ ప్రాంగణంలో రాజరాజేశ్వరీదేవి ప్రధాన (కొత్త రామాలయం) ప్రభతో రెండో వీధి ఉత్సవాలు ప్రారంభించారు. ఇవి తొలుత పగటి పూటే జరిగేవి. సుమారు 150 సంవత్సరాల నుంచి రాత్రి పూట కూడా ఉత్సవాలు నిర్వహించడం ప్రారంభించారు.

**– ముత్యాల వీరభద్రరావు, అధ్యక్షుడు, కొత్త రామాలయం ఉత్సవ కమిటీ, కొత్తపేట**

# శ్రీవారి కొండపై సంబరాల సంక్రాంతి



భోగి మంట వెలిగిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఈఓ త్రినాథరావు



డూడూ బసవన్నల విన్యాసాలను వీక్షిస్తున్న ఎమ్మెల్యే తలారి తదితరులు

- వేడుకల్లో పాల్గొన్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- అలరించిన కళాకారుల వేషధారణలు

ద్వారకా తిరుమల: చిన్న వెంకన్న వెలసిన శ్రీవారి కొండపై తెలుగు సంప్రదాయాలను కళ్లకు కట్టేలా ఆదివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. భోగి పండగను పురస్కరించుకుని ఆలయ తూర్పు ప్రాంతంలో ఈ సంబరాలను అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు దంపతులు శ్రీవారి చిత్రపటానికి పూజలు చేసి, భోగి మంట వెలిగించి, సంబరాలను ప్రారంభించారు. చిన్నారులకు భోగి పండ్లు పోశారు. పూరి గుడిసె, ఎడ్ల బళ్లు, గుర్రాలు, కోడి పుంజులు, కళాకారుల విన్యాసాలు, కోలాట భజనలతో ఆ ప్రాంతం పండగ శోభను సంతరించుకుంది. గజలక్ష్మి సందడి చేసింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పులి, బుడబుక్కలు తదితర వేషధారణలు చూపరులను ఆకట్టుకున్నాయి.

# పారిశుధ్య కార్మికులే ప్రథమ వైద్యులు

ధవళేశ్వరం: చెత్తను తొలగించి, ప్రజారోగ్యాన్ని కాపాడే పారిశుధ్య కార్మికులే ప్రథమ వైద్యులని, వారిని గౌరవించుకోవడం మన బాధ్యతని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. స్వచ్ఛ భోగి కార్యక్రమంలో భాగంగా ధవళేశ్వరం జక్కంపూడి సీతారత్నం కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన 'స్వచ్ఛత – బాధ్యత' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత స్థానిక నాయకులు, అధికారులు, పారిశుధ్య కార్మికులతో కలిసి భోగి మంట వెలిగించారు. అనంతరం రూరల్, కడియం మండలాల్లోని గ్రామాలు, నగరపాలక సంస్థ వార్డుల్లోని పారిశుధ్య కార్మికులకు పాదపూజ చేసి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికులు ప్రజారోగ్యాన్ని కాపాడే వీర సైనికులని, వారిని గౌరవించుకోవడం సామాజిక బాధ్యతని అన్నారు. తాను వారి సేవకుడినని, వారి సమస్యలను తనవిగా భావించి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళారీ వ్యవస్థను రూపుమాపి, ఆశ్రిత పక్షపాతం, అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచారని అన్నారు. సీఎం జగన్ పాలకుడిగా కాకుండా ఒక సేవకునిగా పని చేస్తున్నారని, ఆయన ఆదర్శంతో తాను కూడా పారిశుధ్య కార్మికులను దైవంగా భావించి, సత్కరిస్తున్నానని మంత్రి వేణు అన్నారు. పారిశుధ్య కార్మికుల సేవలు వెల కట్టలేనివని కొనియాడారు. అనంతరం, పారిశుధ్య కార్మికులతో కలిసి మంత్రి వేణు అల్పాహారం తీసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, జిల్లా పంచాయతీ అధికారి జె.సత్యనారాయణ, కడియం ఎంపీడీఓ కె.రత్నకుమారి, రాజమహేంద్రవరం రూరల్ తహసీల్దార్ పి.చిన్నారావు, ధవళేశ్వరం గ్రామ కార్యదర్శి డి.సూరిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు నమస్కరిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు

## విమానాశ్రయంలో రద్దీ

మధురపూడి: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ప్రజలకు గగన ప్రయాణ సేవలందిస్తున్న రాజమహేంద్రవరం విమానాశ్రయానికి సంక్రాంతి కళ వచ్చింది. పండగకు సొంతూళ్లకు వస్తున్న వారితో ఇక్కడకు వస్తున్న, ఇక్కడి నుంచి వెళ్తున్న విమానాలు దాదాపు ఫుల్ అవుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, బెంగళూరు విమానాలకు ప్రయాణికుల రద్దీ ఏర్పడింది. మధురపూడిలోని రాజమహేంద్రవరం విమానాశ్రయానికి ఇండిగో సంస్థ 9 విమానాలను 18 సర్వీసులుగా నడుపుతోంది. ఇవి ఉదయం 8.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకూ రాకపోకలు సాగిస్తున్నాయి. సంక్రాంతి పండగ సందర్భంగా వీటిల్లో 650 నుంచి 750 మంది ప్రయాణికులు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాల నుంచి ఇక్కడకు చేరుకుని, సొంతూళ్లకు వెళ్తున్నారు. మూడు రోజులుగా ప్రయాణికుల రద్దీ పెరగడంతో విమానాశ్రయం సందడిగా మారింది.



విమానాశ్రయం నుంచి వస్తున్న ప్రయాణికులు

## క్లుప్తంగా

### వాలీబాల్ విజేత బొడ్డు చినవెంకటాయపాలెం



విజేత జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎంపీపీ సునీత, ఏఎంసీ చైర్మన్ శివన్నారాయణ

**తాళ్లరేవు:** 13వ సంక్రాంతి సంబరాల్లో భాగంగా పి.మల్లవరంలో నిర్వహించిన మెగా వాలీబాల్ పోటీలు శనివారం రాత్రితో ఘనంగా ముగిసాయి. స్థానిక పెదపేటలో నాకౌట్ పద్ధతిలో డే అండ్ నైట్, ఫ్లడ్ లైట్ల కాంతుల్లో ఈ పోటీలను మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. సుమారు 28 జట్లు తలపడగా భైరవపాలెం, బొడ్డు చినవెంకటాయపాలెం జట్లు ఫైనల్‌కు చేరాయి. హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో బొడ్డు చినవెంకటాయపాలెం విజయం సాధించగా, భైరవపాలెం జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. కాగా గిరియాంపేట జట్టు తృతీయ, పెదవలసల జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. విజేత జట్టుకు ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ బహుమతులు ప్రదానం చేశారు. వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, నాయకులు మట్టపర్తి లోవరాజు, విళ్ల వీర పాల్గొన్నారు.

### గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన వ్యక్తి

**ఆలమూరు:** మండలంలోని 216ఏ జాతీయ రహదారిలోని చెముడులంకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీనునాయక్ కథనం ప్రకారం స్థానిక బస్టాండ్ సమీపంలో మతి స్థిమితం లేని వ్యక్తి రోడ్డు డివైడర్ నుంచి జారిపడి ఈ నెల ఐదున తీవ్రంగా గాయపడ్డారు. దీంతో స్పందించిన స్థానికులు అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. అతని మృతదేహాన్ని ఆస్పత్రి మార్చురీలో ఉంచారు. ఆచూకీ తెలిసిన వారు ఆలమూరు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

# భోగిదండ వైభోగం



1500 అడుగుల భోగి పిడకల దండను తీసుకువస్తున్న గారపాటి వీధి ప్రజలు



కేశనపల్లిలో 500 అడుగుల భోగి పిడకల దండ



రంగాపురంలో 800 అడుగుల భోగిదండతో గ్రామస్తులు



రాజోలులో భోగి పిడకల దండ ఊరేగింపు

**అమలాపురం టౌన్:** పట్టణంలో గారపాటి వీధి ప్రజలు భోగి పండుగను ఆదివారం వినూత్నంగా నిర్వహించారు. గోమయం (ఆవు పేడ)తో సంప్రదాయబద్ధంగా 1500 అడుగుల భోగి పిడకల దండను ఆ వీధివారు తయారు చేయడం ఓ ఎత్తయితే అంత పొడవు దండను వీధి ప్రజలు ఒకరు తర్వాత ఒకరు వరసగా పట్టుకుని ప్రదర్శనగా భోగి మంట వద్దకు తీసుకువచ్చి వేయడం మరో ఎత్తు. సుమారు నెల రోజుల నుంచి కష్టపడి ఈ దండను సిద్ధం చేశారు. స్థానిక గీతా మందిరం నిర్వాహకులు కూడా ఇంతటి భారీ దండ తయారీలో సహకరించారని ఆ వీధికి చెందిన నల్లా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వార్డు కౌన్సిలర్ గండి హారిక, వీధి పెద్దలు దంగేటి శ్రీహరి, గండి స్వామి, తోరం రాము, కోకా రాంబాబు, మెండా వెంకన్నబాబు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**భారం వారి భారీ దండ..**

**రాజోలు:** భోగి పండుగను పురస్కరించుకుని రాజోలులోని భారం వారి వీధిలో నయనాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 1500 అడుగుల పొడవైన భారీ భోగి పిడకల దండ తయారుచేశారు. స్థానికులు ఆ భారీ పిడకల దండను భక్తి శ్రద్ధలతో గంగిరెద్దులు, హరిదాసు కీర్తనలతో ఊరేగింపుగా తీసుకు వెళ్లి భోగి మంటలో వేసి తమ భక్తిని చాటుకున్నారు. స్థానికులు అనంత లక్ష్మి, నయనాల దుర్గాప్రసాద్, శ్రీదేవి, అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

**రంగాపురంలో 800 అడుగులతో**

**అమలాపురం రూరల్:** భోగి పండగ సందర్భంగా 15 వేల ఆవు పిడకలతో 800 అడుగుల భారీ భోగిదండ పలువురిని విశేషంగా ఆకట్టుకుంది. అమలాపురం రూరల్ మండలం సమనస పంచాయతీ పరిధిలో రంగాపురం గ్రామంలో విశ్రాంత ఉపాధ్యాయుడు భూపతిరాజు విశ్వనాథరాజు కుటుంబ సభ్యులు శ్రీరామ సత్య, కుమార్తెలు మౌక్తిక, కార్తీకతో కలిసి గ్రామస్తులు దేశీయ ఆవు పేడతో 15 రోజులు కష్టపడి ఈ దండను తయారు చేశారు. ఈ దండను పుర వీధుల్లో ఊరేగించి భోగిమంటలో వేశారు.

**కేశనపల్లిలో..**

**మలికిపురం:** మండలంలోని కేశనపల్లి గ్రామంలో 500 అడుగుల పిడకల దండ తయారు చేసి భోగి మంటలలో వేశారు. అంతకుముందు యువతులు ప్రధాన రోడ్డుపై ఆ పిడకల దండను ప్రదర్శిస్తూ భోగి మంట వద్దకు తీసుకువెళ్లారు.

# పందెం కోడీ

- మొదలైన సంక్రాంతి పందేలు
- ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల బరులు



మలికిపురం బరిలో హోరా హోరీగా తలపడుతున్న పందెం కోళ్లు

**అమలాపురం టౌన్/సాక్షి నెట్‌వర్క్:** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి కోడి పందేలు ఆదివారం మొదలయ్యాయి. పండగ మూడు రోజులూ జరిగే ఈ పందేలను వీక్షించేందుకు, రూ.వేలు, రూ.లక్షల్లో కాసేందుకు వేలాదిగా తరలివస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 80 బరులు ఏర్పాటైనట్టు సమాచారం. వీటిలో దాదాపు రూ.20 కోట్ల మేర పందేల రూపంలో చేతులు మారతాయని అంచనా వేస్తున్నారు. తొలి రోజే రూ.6 కోట్ల వరకూ పందేలు జరిగాయని తెలుస్తోంది. హైదరాబాద్‌లో ఉద్యోగాలు, వ్యాపారాలతో స్థిరపడిన వారందరూ కార్లలో సొంతూళ్లకు వచ్చి మరీ కోడి పందేలను ఆసక్తిగా తిలకిస్తున్నారు. బరుల వద్దకు మోటార్ సైకిళ్లు, కార్లలో అధిక సంఖ్యలో వస్తున్నారు. పలుచోట్ల బరుల వద్ద గుండాటలు కూడా ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల వీటిని పోలీసులు అడ్డుకున్నారు.

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం గెద్దనపల్లిలో భారీ బరి ఏర్పాటైంది. ఇక్కడ రూ.కోట్లలో పందేలు కాస్తున్నారు. మండల కేంద్రమైన మలికిపురంలో కూడా భారీ బరి ఏర్పాటు చేశారు. లక్కవరం, కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, అల్లవరం, అమలాపురం రూరల్ మండలం కామనగరువు, ఇందుపల్లిలో సైతం పెద్ద బరులు ఏర్పాటయ్యాయి. ముమ్మిడివరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నిర్వాహకులు క్రికెట్ పోటీలను తలపించే రీతిలో కోడి పందేలు సాగిస్తున్నారు. నిబంధనలు తుంగలో తొక్కి, బారికేడ్లు, ఎల్ఈడీ స్క్రీన్లతో బరులు ఏర్పాటు చేసి మరీ పందేలు నిర్వహించారు.
- తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ, గోకవరం, కొవ్వూరు, అనపర్తి తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో కోడి పందేలు జరిగాయి. నల్లజర్ల మండలంలో పోలీసులు గుండాటకు ఎక్కడా అనుమతించలేదు. ఇక్కడ మధ్యాహ్నం తర్వాతే పందేలు ప్రారంభించారు. ఎక్కడా మునుపటి ఉత్సాహం కనపడలేదు. తాళ్లపూడి మండలంలోని పలు గ్రామాల్లో కోడి పందేలు ఉదయం కొంత ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ఈ మండలంలోని మలకపల్లిలో ఏర్పాటు చేసిన బరి వద్ద బౌన్సర్లను పెట్టి మరీ పందేలు నిర్వహించారు. నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లోని 25 బరుల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారు.
- కాకినాడ జిల్లా పెద్దాపురం నియోజకవర్గంలోని వేట్లపాలెం, మేడపాడులో భారీ ఎత్తున పందేలు జరిగాయి. ఉండూరు, పులిమేరు, అచ్చంపేటల్లో కూడా బరులు ఏర్పాటు చేశారు. కాకినాడ రూరల్ సర్పవరం, గైగోలుపాడు తదితర చోట్ల కోడి పందేలపై పోలీసులు దాడి చేశారు. డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తదితరులు సిబ్బందితో వెళ్లి గుండాట బోర్డులను తొలగించి, పందేలు నిర్వహిస్తున్న వారిని హెచ్చరించారు. కరప మండలంలోని పలు గ్రామాల్లో కోడి పందేలు జరిగాయి.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం గెద్దనపల్లిలో వెలిసిన భారీ కోడి పందేల బరి



కాకినాడ రూరల్ కోడి పందాలు వద్ద ఏర్పాటు చేసిన గుండాట బోర్డును తొలగిస్తున్న సీఐ మురళీకృష్ణారెడ్డి

### లారీ ఢీకొని వ్యక్తి మృతి



క్షతగాత్రుడిని 108లో తరలిస్తున్న స్థానికులు



అర్జునరావు (ఫైల్)

**గండేపల్లి:** కుటుంబ సమేతంగా సంక్రాతిని జరుపుకోవాల్సిన వేళ ఆ ఇంట విషాదం నెలకొంది. మృత్యువు లారీ రూపంలో దూసుకువచ్చి ప్రాణాలను బలిగొంది. గండేపల్లి ఎస్సై ఎస్ రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు మండలంలోని నీలాద్రిరావుపేటకు చెందిన కర్రా అర్జునరావు (45) మోటార్ సైకిల్‌పై ఆదివారం ఉదయం పిండి ఆడించేందుకు ఆంధ్రాబ్యాంక్ సమీపంలో గల మిల్లుకు మినుములు తీసుకువెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఆదిత్య ఆస్పత్రి సమీపంలో తన స్వగ్రామం వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా రాజమహేంద్రవరం వైపు నుంచి విశాఖ వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో అర్జునరావు కాళ్లకు, తలకు తీవ్ర గాయాలై ముక్కు, చెవుల నుంచి రక్తం బయటకు వచ్చి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ప్రమాద స్థలానికి చేరుకున్న 108 అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని స్థానికులు, పోలీసుల సాయంతో జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. అంతకు ముందు కొన ఊపిరితో ఉన్న క్షతగాత్రుడిని మండల పరిధిలో గల అత్యవసర విభాగానికి చెందిన ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడి సిబ్బంది అత్యవసర వైద్యం కూడా చేయకుండా పంపిచేసినట్టు అక్కడ ప్రత్యక్షసాక్షులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేయనున్నట్టు ఎస్సై పేర్కొన్నారు. మృతునికి భార్య దేవి, తల్లి కాంతం, కొడుకు శివ సుబ్రహ్మణ్యేశ్వరరావు అనే పండు, కూతురు వీరలక్ష్మి ఉన్నారు. వీరలక్ష్మికి వివాహం కాగా కుటుంబమంతా అర్జునరావుపైనే ఆధారపడి ఉంది. ప్రమాదస్థలం వద్దకు చేరుకున్న రోడ్డు సేఫ్టీ సిబ్బంది స్తంభించిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

**ప్రత్తిపాడులో లారీ ఢీకొని..**

**ప్రత్తిపాడు:** ప్రత్తిపాడు జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. స్థానిక పోలీసుల కథనం మేరకు రంగంపేట మండలం వడిశలేరు గ్రామానికి చెందిన గాజివెల్లి శ్రీను తన భార్య అపర్ణ (17)తో కలిసి బైక్‌పై ప్రత్తిపాడు మండలం రాచపల్లి గ్రామంలోని తన బంధువుల ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను స్థానిక జాతీయ రహదారిపై అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద తుని వైపు వెళ్తున్న కంటైనర్ లారీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో అపర్ణ (17) అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త గాజివెల్లి శ్రీనుకు స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### చెరువులో పడి వ్యక్తి మృతి

**అల్లవరం:** అల్లవరం మండలం ఓడలరేవు గ్రామానికి చెందిన కర్రి రాంబాబు (35) ఓఎన్‌జీసీ గేటు వద్ద చేపల చెరువులో ప్రమాదవశాత్తూ పడి మృతి చెందాడు. ఆదివారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన రాంబాబు ప్రమాదవశాత్తూ చెరువులో పడిపోయాడు. సమయానికి ఎవరూ లేకపోవడంతో మృతి చెందారు. స్థానికులు గుర్తించి పోలీసులు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై అల్లవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, పాప ఉన్నారు.



### మానవ ప్రయత్నం, దైవం రెండూ అవసరమే

**సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ**



**ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్):** ఒక పనిలో విజయం సాధించడానికి మానవయత్నం, దైవం అనుకూలించడం రెండూ అవసరమేనని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. ఆదివారం హిందూ సమాజంలో ఆయన 33వ రోజు ప్రవచనాన్ని నిర్వహించారు. హనుమతో సీత మాట్లాడుతూ 'నన్ను తిరిగి పొందడానికి రాముడు పురుష ప్రయత్నం చేస్తూనే, దైవానుగ్రహం కోసం దైవారాధన చేస్తున్నాడు కదా'? అని ప్రశ్నిస్తుంది. నా మీద బెంగతో దైవారాధనను విస్మరించడం లేదు కదా? అలా అని మానవ ప్రయత్నంగా స్నేహితులను సమకూర్చుంటుకున్నాడు కదా? సామ, దానాలు మిత్రుల పట్ల, దాన, భేద, దండోపాయాలను శత్రువుల పట్ల రాముడు ప్రయోగిస్తున్నాడు కదా? ఆయన మిత్రులు అందరూ మంచివారే కదా? అని హనుమను సీతాదేవి ప్రశ్నిస్తుందని సామవేదం అన్నారు. మానవుడు ప్రయత్నశీలుడు కావాలి. దేవతల అనుగ్రహం కోసం ప్రయత్నమూ చేయాలి. అనుగ్రహం ఆలస్యమైనా భగవంతుని పట్ల విశ్వాసం సడలిపోరాదని సామవేదం వివరించారు. హనుమ సీతాదేవితో 'అమ్మా! నా వీపును అధిరోహించు, నిన్ను వెంటనే రాముని వద్దకు చేరుస్తాను, అగ్నిహోత్రుడు దేవతల వద్దకు యజ్ఞాలలో సమర్పించే హవిస్సును అందచేసే విధంగా నిన్ను రాముని వద్దకు చేరుస్తాను' అని హనుమ అంటాడు. సీతాదేవి అంగీకరించదు. నేను రాముని తప్ప పరాయిపురుషుని తాకను. రెండవది నీ ప్రతిపాదన రామునికి గౌరవం కాదు. ఆయన వచ్చి, వీరోచితంగా పోరాడి నన్ను తీసుకువెళ్లాలి అని సీతాదేవి అంటుంది. ఇక్కడ హనుమ అగ్నిహోత్రుడు హవిస్సును ఆయా దేవతలకు చేర్చినట్లు.. అని పేర్కొనడంలో రహస్యం ఉంది. రాముడు యజ్ఞ పురుషుడు, సీతమ్మ వేదం, రాక్షసులు యజ్ఞ ద్రోహులు, హనుమ హవిస్సులను చేర్చే అగ్ని. అగ్ని వాక్కుకు అధిష్ఠాన దేవత. హనుమ వాగ్రూపంలో ఉన్న అగ్నిహోత్రుడేనని సామవేదం అన్నారు. శ్రీవిద్యా రహస్య గ్రంథాలలో కొన్ని మంత్రాలలో అమ్మవారికి సంబంధించిన మంత్రులు కొందరు ఉన్నారని, వారు అమ్మవారి వ్యవహారాలు చక్కబెడుతుంటారని, వారిలో హనుమ ఒకడని సామవేదం పేర్కొన్నారు.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
15-1-2024

**స్టాక్ మార్కెట్లు** (శుక్రవారం ముగింపు)

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ ▲ | నిఫ్టీ ▲ |
|---|---|
| 847 | 247 |
| 72,568 | 21,895 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

**విదేశీ సూచీలు**

| సూచీ | విలువ | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 14,973 | ▲ | 3 |
| డోజోన్స్ | 37,593 | ▼ | 118 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,625 | ▲ | 48 |
| డాక్స్ | 16,705 | ▲ | 158 |
| సాంఘై | 2,882 | ▼ | 5 |
| నికాయ్ | 35,557 | ▲ | 525 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ.లలో

| | కరెన్సీ | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఒకటి | 82.68 | 83.70 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఒకటి | 105.01 | 107.59 |
| € | యూరో | ఒకటి | 92.38 | 92.56 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఒకటి | 56.74 | 58.04 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఒకటి | 56.69 | 56.81 |
| S$ | సింగపూర్ డాలర్ | ఒకటి | 61.69 | 63.49 |
| SAR | సౌదీ రియాల్ | ఒకటి | 21.21 | 22.64 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | ఒకటి | 21.59 | 23.22 |
| ¥ | చైనా యువాన్ | ఒకటి | 10.41 | 23.36 |



# రుణ పడొద్దు!

## బకాయిలు సకాలంలో చెల్లించాలి

- లేదంటే క్రెడిట్ స్కోర్‌కు విఘాతం
- క్రెడిట్ రిపోర్ట్‌లో మచ్చ
- చట్టపరమైన చర్యలను ఎదుర్కొనే పరిస్థితి
- అనవసర చార్జీల భారం
- బ్యాంకుతో సంప్రదింపుల ద్వారా పరిష్కారం
- రుణంపై స్వల్పకాలం పాటు మారటోరియం
- గడువు పెంపుతో తగ్గే ఈఎంఐ

సొంత కారు, అందమైన భవంతి, ఇంట్లో అన్ని రకాల సాధనాలు (మెషీన్లు).. ఎందులోనూ రాజీపడేది లేదన్నట్టుగా ఉంది నేటి యువతరం ధోరణి. ముందు పొదుపు, తర్వాతే ఖర్చు.. గతంలో మన పెద్దలు అనుసరించిన ధోరణి. ముందు ఖర్చు.. మిగిలితేనే పొదుపు అన్నట్టుగా ఉంది నేటి తీరు. ఏ అవసరం వచ్చినా 'తగ్గేదే లే' అన్న ధోరణి కనిపిస్తోంది. కొనుగోళ్ల నుంచి వైద్య చికిత్సల వరకు అన్నింటికీ రుణబాట పడుతున్నారు. తీర్చే సామర్థ్యం ఉంటేనే రుణం తీసుకోవాలి. ప్రాధాన్యత లేని వాటికి సైతం రుణాలను ఆశ్రయిస్తే తీర్చే విషయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావచ్చు. కారణం ఏదైనా సకాలంలో రుణం వాయిదా చెల్లించలేకపోతే, ఎదుర్కోవాల్సిన పరిణామాలు చాలానే ఉంటాయి. చివరికి ఉద్యోగ అన్వేషణకు సైతం దూరం కావాల్సి రావచ్చు.

గతంలో బ్యాంకుల రుణ వృద్ధిలో కార్పొరేట్ రుణాలదే పైచేయిగా ఉండేది. మొదటిసారి 2020 (కరోనా విపత్తు కాలంలో) నవంబర్‌లో బ్యాంకుల రుణాల్లో కార్పొరేట్‌లను కాదని రిటైల్ రుణాలు ముందుకు వచ్చేశాయి. అప్పటి నుంచి 2023 నవంబర్ 17 నాటికి చూస్తే రిటైల్ రుణాలు 79 శాతం పెరగ్గా.. కార్పొరేట్ రుణాల్లో వృద్ధి 28 శాతానికి పరిమితమైంది. 2023లో రెండో త్రైమాసికం (ఏప్రిల్–జూన్)లోనూ రిటైల్ రుణాల్లో వృద్ధి 15 శాతంగా నమోదైంది. రిటైల్ రుణాల్లో కన్జ్యూమర్ ఉత్పత్తుల కొనుగోళ్ల కోసం తీసుకునేవి (విలువ పరంగా) 20 శాతం పెరిగాయి. ద్విచక్ర వాహన రుణాలు 18 శాతం వృద్ధి చెందాయి. వ్యక్తిగత అవసరాల కోసం తీసుకునే రుణాలు 12 శాతం పెరిగాయి. ఆటో రుణాలు 13 శాతం పెరిగితే, ఇంటి రుణాలు విలువ పరంగా మైనస్ 6 శాతంగా ఉన్నాయి. వినియోగ రుణాలు ఎక్కువగా ఉంటున్నట్టు ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కానీ, అదే సమయంలో రుణ ఎగవేతల్లోనూ పెరుగుదల కనిపిస్తోంది. ముఖ్యంగా క్రెడిట్ కార్డ్ రుణాల్లో ఒత్తిడి ఎక్కువగా ఉంది. 2023 జూలై నాటికి క్రెడిట్ కార్డ్ రుణాలు రూ.2.13 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఏడాది క్రితం కంటే 31 శాతం పెరిగాయి. రిటైల్ రుణాలన్నీ కూడా అన్‌సెక్యూర్డ్. రుణ గ్రహీత చేతులు ఎత్తేస్తే అది బ్యాంకింగ్ వ్యవస్థపై భారాన్ని మోపుతుంది. అందుకే రిజర్వ్ బ్యాంక్ వ్యక్తిగత, అన్ సెక్యూర్డ్, క్రెడిట్ కార్డ్ రుణాలకు రిస్క్ వెయిటేజీ పెంచుతూ, వీటికి బ్యాంకులు మరిన్ని నిధులను పక్కన పెట్టేలా గత నవంబర్‌లో ఆదేశాలు తీసుకొచ్చింది.




తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లించలేకపోయినా, రుణాన్ని ఎగవేసినా అది క్రెడిట్ స్కోర్‌ను గణనీయంగా తగ్గించేస్తుంది. కరోనా అనంతరం రిటైల్ రుణాలు తీసుకోవడం గణనీయంగా పెరిగిపోగా, అదే సమయంలో అంతకుముందు తీసుకున్న రుణాలకు సంబంధించి ఎగవేతలు కూడా పెద్ద మొత్తంలోనే నమోదయ్యాయి. దీంతో బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు పెద్ద

### క్రెడిట్ స్కోర్‌కు విఘాతం




మొత్తాల్లో కేటాయింపులు చేయాల్సి వచ్చింది. ఈ పరిణామాలతో చాలా మంది రుణ గ్రహీతల క్రెడిట్ స్కోర్‌పై ప్రభావం పడింది. నేడు ప్రతి రుణానికి సంబంధించి చెల్లింపుల చరిత్రతో క్రెడిట్ బ్యూరోలు రికార్డులను నిర్వహిస్తున్నాయి. రుణం సకాలంలో చెల్లించకపోయినా, ఎగ్గొట్టినా, సెటిల్‌మెంట్ చేసుకున్నా, రుణం కావాలంటూ విచారణలు చేసినా, అవన్నీ సంబంధిత వ్యక్తి పేరిట రికార్డుగా నమోదవుతాయి. వీటి ఆధారంగానే క్రెడిట్ బ్యూరోలు స్కోర్‌ను కేటాయిస్తుంటాయి. 750, అంతకుమించి క్రెడిట్ స్కోర్ ఉంటే అది మెరుగైనది. రుణం సులభంగా వస్తుంది. మెరుగైన రేటుకు వస్తుంది. 750కంటే తక్కువ ఉంటే రుణం పొందడం కష్టమవుతుంది. ఒకవేళ రుణం లభించినా, అది అధిక వడ్డీ రేటుపై తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అందుకని ఎట్టి పరిస్థితుల్లోనూ రుణ వాయిదాలను సకాలంలో చెల్లించాలి. నేడు దాదాపు అన్ని బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు క్రెడిట్ స్కోర్ ఆధారంగానే అన్‌సెక్యూర్డ్ రుణాలు మంజూరు చేస్తున్నాయి.

### తదుపరి పరిణామాలు..

బకాయి చెల్లించాలంటూ రుణగ్రహీతను రుణం ఇచ్చిన సంస్థలు కోరతాయి. గడువు తీరిన 30 రోజులకూ చెల్లింపులు చేయకపోతే అప్పుడు ఆయా రుణగ్రహీతల సమాచారాన్ని క్రెడిట్ బ్యూరోలకు పంపిస్తుంటాయి. 30–60 రోజుల పాటు చెల్లింపులు చేయకపోతే అది క్రెడిట్ స్కోరును దెబ్బతీస్తుంది. ఇక రుణ వాయిదా 60 రోజులు దాటినా చెల్లించలేని వారి క్రెడిట్ స్కోర్ మరింత తగ్గిపోతుంది. తక్కువ క్రెడిట్ స్కోర్ వల్ల భవిష్యత్తులో రుణానికి ద్వారాలు మూసుకుపోతాయి. అత్యవసరంలో రుణం కావాల్సి వస్తే నిరాకరణ ఎదురుకావచ్చు. డిజిటల్‌గా రుణాలు ఇచ్చే సంస్థలు కనీసం ఒక్క రోజు ఆలస్యం చేసినా,ఎగవేతదారుల జాబితాలో చేరాల్సి వస్తోంది. 650–750 మధ్య స్కోర్ ఉన్న వారికి గృహ రుణం కావాలంటే, మెరుగైన స్కోర్ ఉన్న వారితో పోలిస్తే 2 శాతం అధిక రేటు చెల్లించాల్సి వస్తుంది. రూ.50 లక్షల రుణం 20 ఏళ్ల కాలవ్యవధికి కావాలంటే, తక్కువ స్కోర్ కారణంగా వడ్డీ రూపంలో అదనంగా రూ.12 లక్షల వరకు భారాన్ని మోయాల్సి రావచ్చు. సెక్యూర్డ్, అన్‌సెక్యూర్డ్ రుణాల మధ్య ఈ రేటు వ్యత్యాసం మారుతుంది.

రుణం ఎగ్గొట్టడం సివిల్ నేరం కిందకు వస్తుంది. రుణ గ్రహీత ఇచ్చిన చెక్కుల ద్వారా వసూలు చేసుకునే చర్యలను ఆర్థిక సంస్థలు ప్రారంభిస్తాయి. గడువు ముగిసిన 90 రోజుల్లోపు కూడా రుణ గ్రహీత చెల్లించకపోతే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, నోటీసు వస్తుంది. 180 రోజులు (ఆరు నెలలు) ముగిసినా ఎలాంటి ఫలితం లేకపోతే అప్పుడు నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ యాక్ట్, 1881లోని సెక్షన్ 138 కింద రుణం ఇచ్చిన సంస్థ కేసు దాఖలు చేస్తుంది. చెల్లించే సామర్థ్యం ఉన్నా, చెల్లించకపోతే ఉద్దేశపూర్వక ఎగవేతదారు అనే ముద్ర పడుతుంది. సరైన కారణంతో రుణం చెల్లించలేని పరిస్థితుల్లో ఉంటే అప్పుడు రుణం ఇచ్చిన సంస్థతో చర్చలు నిర్వహించి పరిష్కారానికి, పరస్పర అంగీకారానికి రావచ్చు.

హోమ్‌లోన్ లేదా ప్రాపర్టీ లోన్ లేదా బంగారంపై రుణం వంటి సెక్యూర్డ్ రుణాల్లో రుణ గ్రహీత చెల్లింపుల్లో చేతులు ఎత్తేస్తే.. తనఖాగా ఉంచిన ఆస్తులను బ్యాంకులు వేలం వేస్తుంటాయి. అలాగే, ఆటోమొబైల్ రుణాల్లోనూ వాహనాన్ని జప్తు చేసి, చెల్లింపులకు తగినంత వ్యవధి ఇస్తాయి. అప్పటికీ చెల్లించకపోతే వాహనాన్ని వేలం వేసి రుణంలో సర్దుబాటు చేసుకుంటాయి.

## బ్యాంక్ జాబ్ కష్టమే!

బలహీన క్రెడిట్ స్కోర్ ఉందంటూ ఉద్యోగ దరఖాస్తు తిరస్కరించే అధికారం బ్యాంకుల బోర్డులకు ఉంటుంది. బ్యాంక్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే వారికి కనీసం 650 క్రెడిట్ స్కోర్ ఉండాలన్న నిబంధనను ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్) విధించింది. బాధ్యతాయుత ఆర్థిక నడవడిక ఉండాలన్నది దీని వెనుక ఉద్దేశం. ఎంతో విలువైన లావాదేవీల వ్యవహారాల బాధ్యతలను బ్యాంకుల ఉద్యోగులు చూస్తుంటారు. అందుకే ఈ నిబంధన ప్రవేశపెట్టారు. అందుకే బ్యాంకు ఉద్యోగాలకు ప్రయత్నించే వారు మెరుగైన స్కోర్ కోసం ముందు నుంచే తగిన జాగ్రత్త చర్యలను పాటించడం మంచిది. కొన్ని బహుళజాతి సంస్థలు కూడా ఉద్యోగం కోరుతున్న వారి క్రెడిట్ స్కోర్‌ను పరిశీలిస్తుంటాయి. 2022 మార్చిలో ఎస్‌బీఐ ప్రొబేషనరీ ఆఫీసర్ల రిక్రూట్‌మెంట్ కోసం జారీ చేసిన



ప్రకటనలో.. బ్యాంక్‌లు/ఎన్‌బీఎఫ్‌సీల నుంచి తీసుకున్న ఏ రుణం చెల్లింపుల్లో అయినా విఫలం అయినట్టయితే, క్రెడిట్ కార్డ్ బకాయిలు సకాలంలో చెల్లింపులు చేయకపోతే అటువంటి వారు నియామకానికి అర్హులు కాదని స్పష్టంగా పేర్కొంది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్‌ఎస్‌ఐ) రంగంలో ఉద్యోగార్థుల క్రెడిట్ రిపోర్ట్‌లను పరిశీలించడం సర్వసాధారణమని.. దీనివల్ల ఆర్థికంగా ఎంత బాధ్యతాయుతంగా ఉంటారనేది తెలుస్తుందని డిజిటల్ లెండింగ్ ప్లాట్‌ఫామ్ ఫైబ్ హెచ్‌ఆర్ హెడ్ మోనికా మిశ్రా తెలిపారు. ఇది సంస్థలో మోసాలు, చోరీల అవకాశాలను తెలియజేస్తుందన్నారు. ఆర్థిక అంశాల నిర్వహణలో బాధ్యతారహితంగా ఉండే వ్యక్తి, కంపెనీ ఆర్థిక వ్యవహారాల నిర్వహణకు సరైన వ్యక్తి కాదని మిశ్రా వివరించారు.

### రుణం కోసం రుణం...



తీసుకున్న రుణాన్ని చెల్లించలేని పరిస్థితుల్లో మరో రుణం తీసుకుని చెల్లించే ఆలోచనలు సరికాదు. ముందు తీసుకున్న రుణంపై అధిక వడ్డీ రేటు ఉండి, చాలా తక్కువ రేటుకే మరో సంస్థ రుణం ఇవ్వడానికి ముందుకు వస్తే అప్పుడు ఆలోచించొచ్చు. తక్కువ రేటుపై రుణం తీసుకుని అధిక రేటుతో కూడిన రుణాన్ని తీర్చివేయవచ్చు. వ్యక్తిగత రుణాలపై 14–15 శాతం మేర వడ్డీ రేటు ఉంటే, మెరుగైన క్రెడిట్ స్కోర్ ఉన్న వారికి 12 శాతానికే లభిస్తుంది. అలాంటప్పుడు పరిశీలించొచ్చు. అంతేకానీ, చెల్లింపుల సమస్య నుంచి బయటపడేందుకు మరో రుణాన్ని ఆశ్రయిస్తే సమస్యను పెంచుకున్నట్టు అవుతుంది. అలాగే, క్రెడిట్ కార్డ్‌పై 3–4 రూపాయల వడ్డీ పడుతుంది. వ్యక్తిగత రుణాన్ని తీసుకుని క్రెడిట్ కార్డ్ రుణాన్ని తీర్చివేయవచ్చు.

### రుణ గ్రహీత ముందున్న మార్గం




రుణం తీసుకుని, చెల్లింపులు సకాలంలో చేయకపోయినా.. రుణం ఇచ్చిన సంస్థలు గౌరవప్రదంగా, పారదర్శకంగానే వ్యవహరించాలి కానీ, వేధించడం, బెదిరించడం చేయకూడదని బ్యాంక్ బజార్ సీఈవో ఆదిల్‌శెట్టి తెలిపారు. రుణం 90 రోజులకు మించి చెల్లింపులు లేకపోతే, అప్పటికీ చెల్లించేందుకు 60 రోజుల నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. సెక్యూర్డ్ రుణం చెల్లించనప్పుడు, తనఖాలో ఉంచిన ఆస్తులు లేదా వాహనాలను విక్రయించగా, వచ్చే మొత్తం నుంచి రుణం మినహాయించుకుని మిగిలినది తిరిగి రుణ గ్రహీతకు ఇచ్చేయాల్సి ఉంటుంది. రుణం చెల్లించలేనప్పుడు మారటోరియం లేదా వన్‌టైమ్ పరిష్కారం కోసం డిమాండ్ చేయవచ్చు. రుణం చెల్లించలేకపోవడం వెనుక సహేతుక కారణాలు ఉంటే బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీ సంస్థను సంప్రదించాలి. చెల్లించడానికి మరింత సమయం ఇవ్వాలని కోరొచ్చు. మీరు చెప్పిన కారణాల్లో వాస్తవికత ఉందని బ్యాంక్/ఎన్‌బీఎఫ్‌సీ భావిస్తే రుణ చెల్లింపులపై స్వల్పకాలం పాటు మారటోరియం (విరామం) కల్పిస్తాయి. లేదంటే రుణ కాల వ్యవధిని పెంచి, ఈఎంఐ మొత్తాన్ని తగ్గిస్తాయి.

## ఏ రుణంలో ప్రతికూలతలు ఎలా..?

### క్రెడిట్ కార్డు రుణం




క్రెడిట్ కార్డ్ బిల్లు మొత్తం చెల్లించలేని సందర్భాల్లో, మినిమం డ్యూ (బిల్లులో నిర్ణీత శాతం) చెల్లించినా సరిపోతుంది. ఈ మినిమం డ్యూని కూడా చెల్లించనట్టయితే ఆరు నెలలు వేచి చూసిన తర్వాత డిఫాల్ట్‌గా ఖరారు చేస్తారు. డిపాజిట్‌ను సెక్యూరిటీగా ఉంచి క్రెడిట్ కార్డు తీసుకుంటే, బకాయి పడిన సందర్భంలో డిపాజిట్‌ను రద్దు చేసి రుణం కింద సర్దుబాటు చేసుకుంటారు. ఎలాంటి సెక్యూరిటీ లేకుండా పొందిన క్రెడిట్‌కార్డు అయితే, బకాయి వసూలు బాధ్యతలను ఏజెన్సీలకు అప్పగిస్తాయి క్రెడిట్ కార్డు కంపెనీలు. రుణ గ్రహీత నుంచి రుణాన్ని రప్పించే ప్రయత్నాలను ఏజెన్సీలు చేస్తాయి. అప్పటికీ ఫలితం లేకపోతే కోర్టులో కేసు దాఖలవుతుంది. బ్యాంక్‌లు, క్రెడిట్ కార్డ్ కంపెనీలు బ్లాక్ లిస్ట్‌ను నిర్వహిస్తుంటాయి. చెల్లింపులు చేయని వారిని బ్లాక్ లిస్ట్‌లో చేరుస్తాయి.

### విద్యా రుణం



విద్యా రుణం ఈఎంఐ చెల్లింపులు సాధారణంగా కోర్సు ముగిసి, ఉద్యోగంలో చేరిన నాటి నుంచి మొదలవుతాయి. కానీ, కొన్ని కారణాల వల్ల కోర్స్‌లో సకాలంలో ఉత్తీర్ణులు కాకపోతే ఉద్యోగం రాదు. కోర్సు పూర్తి చేసినా కానీ వెంటనే అందరికీ ఉపాధి లభిస్తుందన్న గ్యారంటీ కూడా లేదు. లేదంటే ఉద్యోగం వచ్చినప్పటికీ, అది కోల్పోయి ఖాళీగా ఉండాల్సి వచ్చిన సందర్భాల్లో రుణ ఈఎంఐ చెల్లించలేకపోతే, తదుపరి పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. వెంటనే ఉద్యోగం లభించకపోయినా, వచ్చిన ఉద్యోగం కోల్పోయినా బ్యాంకులను సంప్రదించి, పూర్తి వివరాలు తెలియజేయాలి. మరింత గడువు కోరాలి. లేదంటే బ్యాంక్‌లు నిర్ణీత కాలం పాటు వేచి చూసి మిగిలిన రుణాల మాదిరే నోటీసు జారీ ద్వారా తదుపరి చర్యలు ప్రారంభిస్తాయి. విద్యా రుణానికి సంబంధించి డిఫాల్టర్‌గా మారితే భవిష్యత్‌లో ఎన్నో రుణాలకు అవరోధంగా మారొచ్చు. రూ.4–10 లక్షల వరకు విద్యా రుణాలకు బ్యాంక్‌లు ఎలాంటి సెక్యూరిటీని కోరవు. అంతకుమించితే మరో వ్యక్తిని గ్యారంటర్‌గా, లేదా ప్రాపర్టీని తనఖాగా ఉంచాలని కోరతాయి. సకాలంలో చెల్లించలేకపోతే గ్యారంటర్ క్రెడిట్ స్కోర్ దెబ్బతింటుంది.

### వినియోగ రుణం



కన్జ్యూమర్ ఉత్పత్తుల కోసం తీసుకునే రుణాలు, వాహన రుణాలు అయినా గడువులోపు చెల్లించకపోతే ఒకటి రెండుసార్లు నోటీసును జారీ చేస్తాయి. 30 రోజుల్లోగా చెల్లించకపోతే అప్పుడు ముందుగా సమర్పించిన చెక్కులను నగదుగా మార్చుకునే చర్యలు మొదలు పెడతాయి. చెక్కులు బౌన్స్ అయితే కోర్టులో కేసు దాఖలు చేస్తాయి. వాహనం లేదా ఉత్పత్తిని స్వాధీనం చేసుకుంటాయి. వడ్డీసహా రుణ మొత్తాన్ని చెల్లించి సమస్య నుంచి బయటపడవచ్చు.

### వ్యక్తిగత రుణం



వ్యక్తిగత రుణం వాయిదా గడువు ముగిసిన 30 రోజుల వరకు చెల్లించకపోతే డిఫాల్ట్‌గా పరిగణిస్తాయి. ఇదే విషయాన్ని క్రెడిట్ బ్యూరోలకు తెలియజేస్తాయి. ఇలా వరుసగా మూడు వాయిదాల్లో విఫలమైతే అప్పుడు రుణంపై అదనపు వడ్డీ రేటును (పీనల్ ఇంటరెస్ట్) వడ్డిస్తాయి. 30 నుంచి 60 రోజుల్లోపు రుణ వాయిదాను వడ్డీ, అన్ని చార్జీలతో చెల్లిస్తే క్రెడిట్ స్కోర్‌పై స్వల్ప ప్రభావమే పడుతుంది. 90 రోజులకు కూడా చెల్లించకపోతే క్రెడిట్ స్కోర్‌పై ఎక్కువ ప్రభావం పడుతుంది. 180 రోజుల తర్వాత కూడా చెల్లింపులు రాకపోతే అప్పుడు రుణ గ్రహీతపై కేసులు దాఖలవుతాయి.

### గృహ రుణం



ఇంటిపై పొందే మార్ట్‌గేజ్ రుణం చెల్లించకపోతే ఇంటిని కోల్పోవాల్సి వస్తుంది. గడువు ముగిసిన తర్వాత 30 రోజుల్లోపు చెల్లింపులు లేకపోతే దాన్ని డిఫాల్ట్ (బకాయిపడినట్టు)గా పరిగణిస్తారు. వరుసగా మూడు ఈఎంఐలు కూడా చెల్లించకపోతే, అప్పుడు బకాయిలను 60 రోజుల్లోగా సెటిల్ చేసుకోవాలంటే లీగల్ నోటీసు పంపిస్తాయి. ఆ గడువులోపు స్పందించకపోతే, సర్ఫేసీ చట్టం కింద ఇంటి జప్తు ప్రక్రియను మొదలు పెడతాయి. ఆ తర్వాత కూడా కొల్లేటరల్ (తాకట్టు) విలువ, వేలం తేదీ తదితర వివరాలతో ఒక నోటీసు పంపిస్తాయి. అప్పుడు స్పందించినా, బ్యాంక్‌లు పరిష్కారానికి అవకాశం ఇస్తాయి. చివరి ఆప్షన్‌గా ఇంటిని వేలం నిర్వహిస్తాయి. దీనివల్ల ఇంటిని కోల్పోవడంతోపాటు, క్రెడిట్ రిపోర్ట్‌లో కొన్నేళ్లపాటు దీని ప్రభావం కనిపిస్తుంది.

## మిరే నుంచి మల్టీ అసెట్ అలొకేషన్ ఫండ్



మిరే అసెట్ మ్యూచువల్ ఫండ్ తాజాగా మల్టీ అసెట్ అలొకేషన్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ జనవరి 24న ముగుస్తుంది. కనీసంగా రూ. 5,000, సిప్ విధానంలోనైతే రూ. 500 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. దీని ద్వారా సేకరించిన నిధులను ఈక్విటీ, డెట్.. మనీ మార్కెట్ సాధనాలు, గోల్డ్ ఈటీఎఫ్‌లు, సిల్వర్ ఈటీఎఫ్‌లు, ఎక్ఛేంజ్ ట్రేడెడ్ కమోడిటీ డెరివేటివ్స్ మొదలైన వాటిలో ఇన్వెస్ట్ చేస్తారు.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 15-1-2024 | |
|---|---|
| విశాఖ | 599–00 |
| చిత్తూరు | 563–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 550–00 |
| విజయవాడ | 550–00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| **14-1-2024 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 540–00 |
| వరంగల్ | 542–00 |
| రిటైల్ ధర | 6.00 |

## అదనపు పన్ను ఆదాకు మార్గం..?

**పన్ను ఆదా కోసం సెక్షన్ 80సీ కింద ఇప్పటికే రూ.1.50 లక్షలు ఇన్వెస్ట్ చేశాను. దీనికి అదనంగా పన్ను ఆదా కోసం ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకోవాలి?**

– రాకేశ్ వర్మ




ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఐటీ చట్టం సెక్షన్ 80సీ కింద గరిష్ఠ పరిమితి రూ.1.5 లక్షల మేరకు ఇప్పటికే మీరు ఇన్వెస్ట్ చేసి ఉంటే.. అప్పుడు అదనపు పన్ను ఆదా కోసం మీ ముందున్న మార్గం నేషనల్ పెన్షన్ సిస్టమ్ టైర్-1. రిటైర్మెంట్ పథకమైన ఎన్‌పీఎస్‌లో గరిష్ఠంగా రూ.50,000 పెట్టుబడిపై పన్ను మినహాయింపు ప్రయోజనాన్ని పొందొచ్చు. సెక్షన్ 80సీకి అదనంగా కల్పించిన ప్రయోజనం ఇది. విశ్రాంత జీవనం కోసం నిధి ఏర్పాటు చేసుకోవాలనే లక్ష్యాన్ని సాకారం చేసేందుకు వీలుగా 2004లో కేంద్ర సర్కారు ఎన్‌పీఎస్ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. 18–70 ఏళ్ల వయసు పరిధిలోని ఎవరైనా ఇందులో చేరేందుకు అర్హులే. ఒక ఏడాదిలో ఇందులో కనీసం రూ.500 ఇన్వెస్ట్ చేసినా సరిపోతుంది. ఇందులో చేసిన పెట్టుబడి ఏదైనా కానీ 60 ఏళ్ల వరకు వెనక్కి తీసుకోవడానికి ఉండదు. అంటే అప్పటి వరకు లాకిన్ అయి ఉంటుంది. కొన్ని అసాధారణ పరిస్థితులు ఎదురైన సందర్భాల్లోనే దీన్నుంచి ఉపసంహరణలకు అనుమతి ఉంటుంది. 60 ఏళ్లు నిండిన తర్వాత అప్పటి వరకు సమకూరిన నిధి నుంచి 60 శాతాన్ని ఉపసంహరించుకోవడానికి అనుమతిస్తారు. మిగిలిన 40 శాతంతో యాన్యుటీ ప్లాన్ తీసుకోవాలి. ఇటీవలి తీసుకొచ్చిన సవరణ నేపథ్యంలో 60 ఏళ్లు నిండిన తర్వాత.. నెల లేదా త్రైమాసికం లేదా ఏడాదికోసారి క్రమంగా కావాల్సినంత ఉపసంహరించుకోవడానికి వీలు ఏర్పడింది. ఎన్‌పీఎస్‌లో ఇన్వెస్ట్ చేసే వారు 2 రకాల ఇన్వెస్ట్‌మెంట్ ఆప్షన్లలో ఒకటి ఎంపిక చేసుకోవచ్చు. ఆటో లేదా యాక్టివ్. ఆటో ఆప్షన్ ఎంపిక చేసుకోవడం కొంత బెటర్. ఈ ఆప్షన్‌లో ఈక్విటీలకు కేటాయింపులు ఇన్వెస్టర్ వయసు ఆధారంగా మారుతుంటాయి. ఉదాహరణకు ఇన్వెస్టర్ వయసు 35 ఏళ్లు అనుకుందాం. 100 నుంచి 35 ఏళ్లు తీసివేయగా, మిగిలిన మేర (65%) ఈక్విటీలకు కేటాయింపులు వెళతాయి. ఇన్వెస్టర్ వయసు పెరుగుతున్న కొద్దీ ఈక్విటీలకు కేటాయింపులు తగ్గుతూ వెళతాయి. యాక్టివ్ ఆప్షన్‌లో ఈక్విటీలకు గరిష్ఠంగా 75% వరకు పెట్టుబడులు కేటాయించుకోవచ్చు. ఈక్విటీ కేటాయింపులు పోను, మిగిలినదాన్ని డెట్, ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ సాధనాలకు కేటాయించొచ్చు.

## జేకే లక్ష్మీ సిమెంట్ | యాక్సిస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు

**ప్రస్తుత ధర:** రూ. 869 **టార్గెట్:** రూ. 1,000

**ఎందుకంటే:** అనుబంధ సంస్థ ఉదయ్‌పూర్ సిమెంట్ వర్క్స్ లిమిటెడ్ ద్వారా జేకే లక్ష్మీ సిమెంట్ ప్రస్తుతం చేపట్టిన సామర్థ్య విస్తరణ కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి. వార్షికంగా 2.5 మిలియన్ టన్నుల(ఎంటీపీఏ) గ్రైండింగ్ యూనిట్ పనులు పటిష్ట రీతిలో కొనసాగుతున్నాయి. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరం(2024–25) తొలి త్రైమాసికానికల్లా(ఏప్రిల్–జూన్) వాణిజ్య ప్రాతిపదికన ప్రారంభంకావచ్చని అంచనా. ఇప్పటికే 1.5 ఎంటీపీఏ సామర్థ్యంగల క్లింకర్ యూనిట్ కార్యకలాపాలు ప్రారంభంకావడంతోపాటు నిలకడను సైతం సాధించింది. ఉదయ్‌పూర్ సిమెంట్ ప్లాంటులో తయారయ్యే క్లింకర్‌ను గ్రైండింగ్ కోసం జేకే లక్ష్మీ సిమెంట్ వినియోగించుకుంటుంది. మరోపక్క సూరత్‌లోనూ 1.35 ఎంటీపీఏ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటు ప్రణాళికల్లో ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది. ఇందుకు రూ. 220 కోట్ల పెట్టుబడులను వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ఇందుకు నిధులను అంతర్గత వనరులు, రుణాల ద్వారా సమకూర్చుకోనున్నట్లు తెలియజేసింది. 1.35 ఎంటీపీఏలో 0.7 మిలియన్ టన్నుల సామర్థ్యం వచ్చే ఏడాది క్యూ3(అక్టోబర్–డిసెంబర్)కల్లా అందుబాటులోకి రానుంది. మిగిలిన 0.65 ఎంటీపీఏ సామర్థ్యం రెండేళ్ల తదుపరి(2025–26) తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లో ప్రారంభంకావచ్చని అంచనా. ప్రణాళికల ప్రకారమే దుర్గ్ ప్లాంటులో రైల్వే సైడింగ్ పనులు కొనసాగుతున్నట్లు కంపెనీ పేర్కొంది. నిర్వహణ లాభాలను పెంచుకునే బాటలో కంపెనీ విభిన్న చర్యలు తీసుకుంటోంది.



## తేజాస్ నెట్‌వర్క్స్ | ఎమ్‌కే గ్లోబల్ | కొనొచ్చు

**ప్రస్తుత ధర:** రూ. 860 **టార్గెట్:** రూ. 1,050

**ఎందుకంటే:** పరిశోధన, అభివృద్ధి(ఆర్‌అండ్‌డీ) ఆధారిత టెలికం పరికరాల తయారీలో దేశీయంగా అతిపెద్ద కంపెనీగా తేజాస్ నెట్‌వర్క్స్ నిలుస్తోంది. వైర్‌లైన్, వైర్‌లెస్ నెట్‌వర్కింగ్ ప్రొడక్టుల తయారీ, డిజైనింగ్‌లో ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) మొదలు 2027–28 వరకూ కంపెనీ రూ. 29,200 కోట్ల విలువైన ఆర్డర్లను పూర్తి చేయనుంది. వెరసి రూ. 30,000 కోట్ల ఆదాయం, రూ. 6,000 కోట్ల నిర్వహణ లాభం(ఇబిటా) ఆర్జించే అవకాశముంది. ఇందుకు ప్రధానంగా ప్రభుత్వ రంగ టెలికం దిగ్గజం బీఎస్‌ఎన్‌ఎల్, భారత్ నెట్ ప్రాజెక్టులు తోడ్పాటునివ్వనున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరం(2024–25) ఆదాయం గరిష్టస్థాయికి చేరే వీలుంది. ఈ ఏడాదితో పోలిస్తే 5 రెట్లు పుంజుకోవచ్చు. దేశీయంగా తయారీ రంగంపై దృష్టి పెట్టిన కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్న ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం(పీఎల్‌ఐ) ద్వారా కంపెనీ ప్రధానంగా లబ్ధిని పొందే అవకాశముంది. బీఎస్‌ఎన్‌ఎల్, భారత్‌నెట్, రైల్వే ప్రాజెక్టులపై ప్రభుత్వ భారీ పెట్టుబడి వ్యయాలు ఇందుకు సహకరించనున్నాయి. అంతేకాకుండా కీలక మౌలిక సదుపాయాలు, ప్రయివేట్ రంగం నుంచి పెరుగుతున్న డిమాండ్, ప్రపంచస్థాయిలో చైనాకు ప్రత్యామ్నాయ టెలికం పరికరాల కంపెనీలకు పెరుగుతున్న ప్రాధాన్యత సైతం తేజాస్ నెట్‌వర్క్స్‌కు ప్రోత్సాహాన్నిస్తున్నాయి. టాటా గ్రూప్ సెమీకండక్టర్ కార్యకలాపాలు కంపెనీకి ప్రయోజనం చేకూర్చే వీలుంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే